వర్షంలో ఫుడ్ డెలివరీ చేస్తే
అదనపు చార్జీలు

జొమాటో, స్విగ్గీ నిర్ణయం

న్యూఢిల్లీ: ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్స్ జొమాటో, స్విగ్గీ తమ చందాదారులకు షాక్ ఇచ్చాయి. ఇకపై వర్షం పడుతుండగా ఫుడ్ డెలివరీ చేయాలంటే యూజర్స్ అదనంగా చార్జీలు చెల్లించాల్సిందేనని ప్రకటించాయి. ఇప్పటివరకు ప్రీమియం చందాదారులకు వర్తిస్తున్న రెయిన్ సర్‌చార్జ్ మినహాయింపును తొలగిస్తున్నట్టు జొమాటో, స్విగ్గీ తాజాగా ప్రకటించాయి. ఈ నిర్ణయం ఈ నెల 16 నుంచే అమలు చేస్తున్నట్టు తమ యాప్ నోటిఫికేషన్‌లో ఓ సందేశాన్ని విడుదల చేశాయి. దీని ప్రకారం, ఇకపై స్విగ్గీ వన్, జొమాటో గోల్డ్ చందాదారులు (ప్రీమియం సబ్‌స్క్రైబర్స్) అదనపు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. స్విగ్గీ వన్ పేరుతో స్విగ్గీ, జొమాటో గోల్డ్ పేరుతో జొమాటో తన కస్టమర్లకు ప్రీమియం సేవలు అందిస్తున్నాయి. వీటిని కొనుగోలు చేసిన వారికి రెండు సంస్థలు పలు ప్రత్యేక ప్రయోజనాల్ని కల్పిస్తున్నాయి. వాటిలో రెయిన్ సర్‌చార్జ్ మినహాయింపు కూడా ఒకటి. అయితే, తాజాగా ఈ సదుపాయాన్ని చందాదారులకు తొలగించాయి. భారీగా వర్షం పడే సమయంలో ఈ సర్‌చార్జ్ రూ.15 నుంచి రూ.30 వరకు విధించే అవకాశముంది. ఈ సంస్థలు ఇప్పటికే డెలివరీ ఫీజుకు అదనంగా ప్లాట్‌ఫామ్ ఫీజును వసూలు చేస్తున్నాయి. ప్రతికూల వాతావరణంలో పనిచేసే తమ డెలివరీ పార్ట్‌నర్స్‌కు మంచి పారితోషికం అందించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని జొమాటో, స్విగ్గీ పేర్కొన్నాయి.

అత్యంత బలహీనంగా ఇండియా కూటమి

కాంగ్రెస్ నేత చిదంబరం

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష ఇండియా కూటమి కేంద్రంలోని అధికార ఎన్డీయే కూటమికి దీటుగా నిలబడలేకపోతున్నదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పీ చిదంబరం ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో కోలుకోవటంపై అనుమానం వ్యక్తం చేశారు. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి కూడా కోలుకునేలా కనిపించటం లేదని అన్నారు. కూటమిలో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న విషయం వాస్తవమేనని అంగీకరించారు. 'ఇండియా కూటమి బలహీనంగా కనిపిస్తున్నది. పుంజుకోవడానికి సమయం పడుతుంది' అని అభిప్రాయపడ్డారు.

గయ పేరు ఇకపై గయ జీ

బీహార్ క్యాబినెట్ ఆమోదం

పాట్నా: స్థానికుల డిమాండ్ మేరకు బీహార్‌లోని గయ పట్టణం పేరును రాష్ట్ర ప్రభుత్వం మార్చింది. గయ టౌన్‌కు గయ జీ అని పేరు పెట్టింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ చేసిన ప్రతిపాదనను ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని క్యాబినెట్ శుక్రవారం ఆమోదించింది. గయాసురుడు అనే రాక్షసుడి పేరును ఈ పట్టణానికి పెట్టారు. వాయు పురాణం ప్రకారం, త్రేతా యుగంలో ఈ ప్రాంతంలో గయాసురుడు ఉండేవాడు. ఆయన శ్రీ మహా విష్ణువు కోసం తపస్సు చేసి, వరం పొందాడు. ఏటా లక్షలాది మంది ఇక్కడికి వచ్చి, పితృ దేవతలకు పిండ ప్రదానాలు చేస్తారు.

ఎన్నారైలపై ట్రంప్ బాదుడు!

- అమెరికా పౌరసత్వం లేనివారిపై పన్ను విధింపునకు నిర్ణయం
- స్వదేశాలకు పంపే డబ్బుపై 5 శాతం ట్యాక్స్‌కు ప్రతిపాదన
- మన దేశంలోని ఎన్నారైల కుటుంబాలపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ: డాలర్ డ్రీమ్స్‌తో అమెరికాలో అడుగుపెట్టిన ఎన్నారైలకు ట్రంప్ చుక్కలు చూపిస్తున్నారు. ఇప్పటికే ఓ వైపు వీసా నిబంధనలు కఠినతరం చేయగా, మరోవైపు జన్మతః పౌరసత్వం రద్దు, ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమ వలసదారులను ఏరివేస్తూ, స్వదేశాలకు తిప్పి పంపుతున్న సంగతి తెలిసిందే. తాజాగా అమెరికా పౌరసత్వం లేనివారిపై మరో పిడుగు వేసేందుకు సిద్ధమయ్యారు. అమెరికా పౌరసత్వం లేనివారు తమ స్వదేశాలకు పంపే డబ్బుపై పన్ను విధించాలని నిర్ణయించారు. అంటే.. విద్యార్థులు, వర్క్ వీసాలపై పని చేస్తున్నవారు తమ ఇంటికి డబ్బు పంపాలంటే 5 శాతం పన్ను కట్టాల్సి వస్తుందన్న మాట. ఆ దేశ దిగువ సభలో ఈ నెల 12న ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులో ట్రంప్ సర్కార్ ఈ ప్రతిపాదనలు పొందుపరిచింది. ఇలా వసూలైన నిధులను సరిహద్దు రక్షణకు వినియోగిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. జూలై 4 నాటికి చట్టంగా మారుతుందని ప్రభుత్వం భావిస్తున్నది.

కఠిన నిబంధనలతో కంటి మీద కునుకు కరువు

ప్రస్తుతం అమెరికాలో లక్షలాది మంది భారతీయులు వర్క్, స్టూడెంట్ వీసాలపై పని చేస్తున్నారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల (ఎన్నారై) ద్వారా ఏటా మన దేశానికి రూ.7.10 లక్షల కోట్ల వరకు (83 బిలియన్ డాలర్లు) డబ్బులు వస్తున్నట్టు అంచనా. ఇందులో అత్యధిక శాతం అమెరికా నుంచే వస్తున్నాయి. ఇప్పటివరకు ఈ లావాదేవీలపై ఎలాంటి పన్ను విధించడం లేదు. ఒక వేళ ట్రంప్ ట్యాక్స్ చట్టంగా మారితే.. ఇకపై ఎన్నారైలు తమ కుటుంబాలకు పంపే ప్రతి లక్ష రూపాయలకు రూ.5 వేలు పన్ను రూపంలో కట్టాల్సి ఉంటుంది. ఇది వారి ఆర్థిక ప్రణాళికలపై తీవ్ర ప్రభావం చూపుతుందని విశ్లేషకులు చెప్తున్నారు.

రియల్ ఎస్టేట్‌పైనా ప్రభావం?

ట్రంప్ ట్యాక్స్ మన రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం పడే అవకాశం ఉన్నదని నిపుణులు చెప్తున్నారు. ఎన్నారైలు మన దేశానికి పంపే సొమ్ములో అత్యధిక శాతం రియల్ ఎస్టేట్ రంగంలోనే పెట్టుబడులుగా పెడుతున్నారు. ఇండ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు వంటివి కొనుగోలు చేస్తున్నారు. ట్రంప్ విధించే పన్నుతో అమెరికా నుంచి వచ్చే డబ్బు తగ్గిపోతుందని, ఇది హైదరాబాద్‌తోపాటు దేశంలోని ఇతర నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం పడే అవకాశం ఉన్నదని అంచనా వేస్తున్నారు.

విడతల వారీగా పంపితే మేలు

జూలై 4 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో.. ఆలోగానే వీలైనంత ఎక్కువ డబ్బును తమ కుటుంబాలకు పంపాలని సూచిస్తున్నారు. ఇకపై డబ్బును విడతల వారీగా పంపాలని సూచిస్తున్నారు. ఒక విడతలో 10 వేల డాలర్లకు మించితే రిపోర్ట్ ఆఫ్ ఫారిన్ బ్యాంక్ అండ్ ఫైనాన్షియల్ అకౌంట్, ఫారిన్ అకౌంట్ ట్యాక్స్ కంప్లయిన్స్ యాక్ట్ (ఎఫ్ఏటీసీఏ) పరిధిలోకి వచ్చే అవకాశం ఉన్నదని చెప్తున్నారు. దీంతోపాటు ట్యాక్స్‌లకు అనుగుణంగా అమెరికాలో తమ కుటుంబ నిర్వహణ ఖర్చులను మార్చుకోవాలని సూచిస్తున్నారు.

రేపటితో కాల్పుల విరమణ
గడువు ముగింపు

న్యూఢిల్లీ : భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందం ఈ నెల 18 వరకు మాత్రమే అమలులో ఉంటుందని పాకిస్థాన్ విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్ శుక్రవారం వెల్లడించారు. ఇరు దేశాల డీజీఎంవోల మధ్య ఈ నెల 10న జరిగిన ఒప్పందం మేరకు సరిహద్దుల్లో కాల్పుల విరమణ అమలైంది. అయితే గడువు ముగుస్తుండటంతో మరికొంత కాలం పొడిగించాలని నిర్ణయించినట్టు తెలిసింది. అయితే ఎన్ని రోజులు పొడిగిస్తారు అన్న విషయాన్ని వారు వెల్లడించలేదు. రెండు దేశాల మధ్య మరో సారి చర్చలు జరుగుతాయని ఇషాక్ దార్ తెలిపారు.

లష్కరే
ఉగ్ర సహచరుల అరెస్ట్

శ్రీనగర్: నిషేధిత లష్కరే తాయిబా సంస్థతో సంబంధం ఉన్న ముగ్గురు ఉగ్రవాద సహచరులను జమ్ముకశ్మీర్‌లోని బడ్గాం జిల్లాలో పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానికంగా ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించడానికి, స్థానికులను ఉగ్రవాదం వైపు ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలతో వీరిని అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారి నుంచి తుపాకీ, గ్రనేడ్ వంటి ఆయుధాలతో పాటు మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. 2020లో పాకిస్థాన్ పారిపోయి ఉగ్రవాదిగా మారిన ఎల్ఈటీకి చెందిన ఆబిద్ ఖయామ్ లోనెతో వీరికి దగ్గర సంబంధాలు ఉన్నాయని పోలీసులు చెప్పారు. ఆబిద్ ఆదేశాల మేరకే వీరు ఇక్కడ పనిచేస్తూ కొత్తగా సంస్థలోకి యువకులు చేరేలా ప్రేరేపిస్తున్నారని తెలిపారు.

కశ్మీర్‌లో 10 వేలకు పైగా ఇండ్లు ధ్వంసం

ఇటీవల పాక్ దాడుల ఫలితం

శ్రీనగర్: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య జరిగిన సైనిక ఘర్షణల వల్ల నియంత్రణ రేఖ వెంబడి జరిగిన నష్టాన్ని నేతలు, అధికారులు అంచనా వేస్తున్నారు. పాక్ వైమానిక దాడుల్లో మూడు జిల్లాల్లో డజన్ల గ్రామాలు దెబ్బతిన్నాయి. వారి బాంబు దాడుల్లో 10 వేలకు పైగా ఇండ్లు ధ్వంసం కాగా, వందలాది మంది మంది పౌరులు నిరాశ్రయులయ్యారు. ప్రజాప్రతినిధులు చేసిన నష్టం అంచనా ప్రకారం కుప్వారా, రాజౌరి, యూరి, పూంచ్ జిల్లాల్లో భారీగానే నష్టం జరిగింది. నష్టం అంచనాను పరిశీలించి, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని నేతలు కోరుతున్నారు.

భారత్-పాక్ మధ్య కోపం మంచిది కాదు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్, మే 16: భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి తామే మధ్యవర్తిత్వం చేశామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం పునరుద్ఘాటించడమే కాక, అది అతి పెద్ద విజయంగా అభివర్ణించారు. గల్ఫ్ పర్యటన అనంతరం వాషింగ్టన్ చేరిన ఆయన ఇరుగు పొరుగు వారి మధ్య ఆ స్థాయి కోపం మంచిది కాదని అన్నారు. 'జరిగిన దానితో మేము చాలా సంతోషంగా ఉన్నాం. ఇది కొనసాగుతుందని ఆశిస్తున్నాను. పరిస్థితి ఇలాగే ఉంటుందని నేను అనుకుంటున్నాను. ఇది చాలా పెద్ద విజయం. ఇద్దరి మధ్య కోపం స్థాయి చూశా. ఇది ఎంత మాత్రం మంచి విషయం కాదు' అంటూ పేర్కొన్నారు.

మొత్తం దేశం, సైన్యం మోదీ కాళ్ల మీద పడ్డయ్!!

మొదటిపేజీ తరువాయి...

మన సైనికులు ప్రధాని నరేంద్ర మోదీ కాళ్లకు మొక్కుతున్నారని వ్యాఖ్యానించారు. మోదీ నాయకత్వంలో దేశం ఉగ్రవాదులకు వారి భాషలోనే సమాధానం ఇచ్చిందని, మోదీ నాయకత్వంలో మన సైన్యం, మన భద్రతా దళాలు సురక్షితంగా ఉన్నాయని ఆయన అన్నారు. దీంతో ఆయన వ్యాఖ్యలు దుమారం రేపాయి. మన సాయుధ దళాల పరాక్రమాన్ని చిన్నచూపు చూస్తున్న ఉప ముఖ్యమంత్రి ప్రధానికే మొత్తం ఘనతను ఆపాదిస్తున్నారని ప్రతిపక్షంతోపాటు పలువురు రక్షణ రంగ నిపుణులు విమర్శించారు. దేవ్డా వ్యాఖ్యలు చవకబారుగా, సిగ్గుచేటుగా ఉన్నాయని కాంగ్రెస్ అభివర్ణించింది. ఇది మన సైన్యం శౌర్య పరాక్రమాలను అవమానించడమేనని ఎక్స్ వేదికగా కాంగ్రెస్ విమర్శించింది.

నా మాటలను వక్రీకరించారు

సివిల్ డిఫెన్స్‌లో శిక్షణ కోసం వచ్చిన వలంటీర్లను ఉద్దేశించి తాను మాట్లాడిన మాటలను కాంగ్రెస్ వక్రీకరించిందని ఉప ముఖ్యమంత్రి జగదీష్ దేవ్డా తెలిపారు. ఆపరేషన్ సిందూర్ కింద భారత సాయుధ దళాలు పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పాయని చెప్తూ సాయుధ దళాల పాదాలకు అత్యంత గౌరవభావంతో యావద్దేశ ప్రజలు మొక్కుతున్నారని తాను అన్నానని ఆయన చెప్పారు. పాకిస్థాన్‌కు గట్టిగా జవాబిచ్చినందుకు ప్రధాని మోదీని ప్రశంసించినట్లు దేవ్డా తెలిపారు.

సైన్యాధికారిణులపై ఎస్పీ నేత వివాదాస్పద వ్యాఖ్యలు

ఆపరేషన్ సిందూర్‌పై సాయుధ దళాల తరపున మీడియా సమావేశాలు నిర్వహించిన భారత సైనిక అధికారిణులు వ్యోమికా సింగ్, ఎయిర్ మార్షల్ ఏకే భారతి కులాలను ప్రస్తావించి సమాజ్‌వాది పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంగోపాల్ యాదవ్ మరో వివాదాన్ని రాజేశారు. గురువారం మొరాదాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో యాదవ్ మాట్లాడుతూ తిరంగా యాత్రల ద్వారా రాజకీయ లబ్ధి కోసం సైనిక ఆపరేషన్‌ను బీజేపీ వాడుకుంటోందని ఆరోపించారు. మత ప్రాతిపదికన సైనికాధికారులను లక్ష్యంగా చేసుకుని బీజేపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. 'వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఎవరో, ఆమె కులం ఏమిటో బీజేపీ నాయకులకు తెలియదు. అలాగే ఎయిర్ మార్షల్ ఏకే భారతి ఎవరో కూడా వారికి తెలియదు. తెలిసి ఉంటే వారిని కూడా దూషించి ఉండేవారు. వ్యోమికా సింగ్ హర్యానాకు చెందిన జాట్ కాగా ఏకే భారతి బీహార్‌లోని పూర్ణియాకు చెందిన యాదవ్. వీరితోపాటు ఉన్నందుకే ముస్లిం మతానికి చెందిన కర్నల్ సోఫియా ఖురేషీని బీజేపీ నాయకులు విమర్శిస్తున్నారు' అంటూ రాంగోపాల్ యాదవ్ వ్యాఖ్యానించారు. కులాలు, మతాల గురించి తెలిసిన తర్వాత బీజేపీ నాయకులు ఊరుకోరని ఆయన వ్యాఖ్యానించారు. ముస్లిం అయినందున ఓ మహిళా అధికారిని(సోఫియా ఖురేషీ) విమర్శించారు. మరో వ్యక్తిని(వ్యోమికా సింగ్) రాజ్‌పుత్‌గా భావించి ఆమెనేమీ అనకుండా వదిలివేశారని ఆయన చెప్పారు. ఆ ముగ్గురు మహిళా అధికారులను వెనుకబడిన-దళిత-మైనారిటీ గ్రూపుగా వారి కులాలను ఆధారం చేసుకుని యాదవ్ అభివర్ణించారు. కాగా యాదవ్ వ్యాఖ్యలను యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఖండించారు.

విదేశాలకు వెళ్లే బృందాలకు
శశి థరూర్ నాయకత్వం?

ఉగ్రవాద వ్యతిరేక ప్రచారానికి నియమించనున్న కేంద్రం

న్యూఢిల్లీ, మే 16: కాంగ్రెస్ నేత శశి థరూర్‌కు కేంద్రంలోని బీజేపీ పెద్ద పీట వేయనుంది. పాకిస్థాన్ ఉగ్రవాదంపై అంతర్జాతీయంగా ప్రచారం చేసేందుకు ఏర్పాటు చేసిన బృందాల్లో శశి థరూర్‌కు అగ్ర స్థానం కల్పించనున్నట్టు తెలిసింది. ఉగ్రవాదానికి, ఉగ్రవాదుల తయారీకి ఫ్యాక్టరీగా మారిన పాకిస్థాన్ అరాచకాన్ని ప్రపంచ దేశాలకు వివరించేందుకు ఒక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నది. అయితే శశి థరూర్ బహుళ పార్టీల ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించి పలు ప్రపంచ దేశాలలో తమ గళం వినిపిస్తారని భావిస్తున్నారు. ఈ ప్రతినిధి బృందానికి శశి థరూర్ నాయకత్వం వహిస్తారని తెలిసింది.

గాజాపై వైమానిక దాడులు
93 మంది మృతి

వందలాది మందికి గాయాలు

గాజా: ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో గాజాలో 93 మంది పౌరులు మరణించారు. గాజా శివార్లలోని దేర్ అల్ బలాహ్, ఖాన్ యూనిస్ నగరంతో సహా గాజావ్యాప్తంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఇజ్రాయెల్ సేనలు వైమానిక దాడులు జరిపాయి. ఈ దాడులలో కనీసం 93 మంది మరణించగా వందలాది మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయెల్ మినహా గల్ఫ్ దేశాలలో జరిపిన పర్యటన ముగిసిన నేపథ్యంలో గాజాపై ఇజ్రాయెల్ దాడులు జరిగాయి. గాజా స్ట్రిప్ సరిహద్దులపై ఇజ్రాయెల్ దిగ్బంధం మూడు నెలలుగా సాగుతోంది.

ప్రత్యేక పార్లమెంట్ సమావేశానికి
కేంద్రం విముఖత?

ఆపరేషన్ సిందూర్ కొనసాగింపే కారణం!

న్యూఢిల్లీ, మే 16: ఆపరేషన్ సిందూర్, తదనంతర పరిణామాల నేపథ్యంలో వాస్తవాలను తెలుసుకునేందుకు, పరిస్థితులపై చర్చించేందుకు పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని విపక్షాలు చేస్తున్న డిమాండ్‌కు అధికార బీజేపీ విముఖత వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. ప్రత్యేక సమావేశానికి బీజేపీ ఎంతమాత్రం ఇష్టపడటం లేదని పలు ఆంగ్ల మీడియా కథనాలు తెలిపాయి. దీంతో జూలైలో జరిగే వర్షాకాల సమావేశాల్లోనే ప్రతిపక్షాలు ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన ప్రశ్నలను లేవనెత్తాల్సి ఉంది. పహల్గాం దాడి అనంతరం జరిగిన పరిణామాలు, విపక్షాలతో కలిసి తీసుకున్న నిర్ణయాలపై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం సాధ్యం కాదని కేంద్రం పేర్కొన్నది. ఆపరేషన్ సిందూర్ పూర్తిగా నిలిచిపోలేదని, ఇటువంటి పరిస్థితుల్లో అనవసర చర్చలకు తావిచ్చి శత్రు దేశానికి లేనిపోని ఊతాలు ఇవ్వడం ఎంతమాత్రం సబబు కాదని బీజేపీ ప్రభుత్వం భావిస్తున్నది.

భారత్‌కు సమీపంలో చైనా గూఢచారి నౌక

పాకిస్థాన్‌కు సాయం చేయడానికేనా?

న్యూఢిల్లీ: చైనా గూఢచారి నౌక డా యాంగ్ యి హావో భారత జలాల్లో సంచరిస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. భారతీయ నౌకల కదలికలు, నిఘా, ప్రతిస్పందన సామర్థ్యం, జలాంతర్గాముల కదలికలను హైడ్రోగ్రాఫిక్ పరికరాల సాయంతో ఈ నౌక పసి గడుతుందని నిపుణులు చెప్తున్నారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత మన నౌకాదళం అరేబియా సముద్రం, హిందూ మహా సముద్రం ఉత్తర తీరం వైపు అప్రమత్తంగా ఉంటున్నది. ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములను మోహరించింది.

ఎందుకు ఆందోళన?

చైనా గూఢచారి నౌకలో అత్యంత అధునాతన సెన్సర్లు ఉన్నాయి. కాబట్టి మన దేశానికి చెందిన ఐఎన్ఎస్ విక్రాంత్ సహా, యుద్ధ నౌకల కదలికలను పసిగట్టగలదని నౌకాదళం భావిస్తోంది. బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ క్రింద చైనా-పాకిస్థాన్ ఎకనమిక్ కారిడార్ నిర్మాణం జరుగుతున్నది. పాక్ ఆక్రమిత కశ్మీర్ గుండా సీపెక్ ప్రాజెక్టును నిర్మించడంపై భారత్ మొదటి నుంచి అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నది. ఈ ప్రాజెక్టు పనులు పూర్తి కావాలంటే పాకిస్థాన్‌లో రాజకీయంగా, ఆర్థికంగా స్థిరమైన పరిస్థితులు ఉండాలి. చైనా నిఘా పెట్టడానికి ఇది కూడా ఓ కారణం కావచ్చు.

జస్టిస్ బేలాకు దక్కని 'వీడ్కోలు'!

ఎస్‌సీబీఏ తీరును తప్పుబట్టిన సీజేఐ

న్యూఢిల్లీ: పదవీ విరమణ పొందిన సుప్రీంకోర్టు మహిళా న్యాయమూర్తి జస్టిస్ బేలా త్రివేదీకి వీడ్కోలు దక్కకపోవడంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పదవీ విమరణ చేసే న్యాయమూర్తులకు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) వీడ్కోలు కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. అయితే, జస్టిస్ బేలా త్రివేదీ కోసం అలాంటి కార్యక్రమాన్ని ప్రకటించకపోవడాన్ని సీజేఐ గవాయ్ శుక్రవారం తీవ్రంగా విమర్శించారు. 'అసోసియేషన్ తీసుకున్న నిర్ణయాన్ని నేను బహిరంగంగా ఖండిస్తున్నాను. ఇలాంటి సమయంలో ఇలాంటి నిర్ణయం తగదు' అని పేర్కొన్నారు. జస్టిస్ మాసిహ్ కూడా ఇదే విధమైన అభిప్రాయాన్ని వెల్లడించారు. వీడ్కోలు సభ ఏర్పాటు చేయకపోవడంపై తాను చింతిస్తున్నానని, సంప్రదాయాన్ని అనుసరించాల్సిందేనని, దానిని గౌరవించాల్సిందేనని ఆయన నొక్కి చెప్పారు. జస్టిస్ త్రివేదీ లాంటి వారు న్యాయవ్యవస్థకు విలువైన ఆస్తి అని పేర్కొన్న సీజేఐ పేర్కొన్నారు. జస్టిస్ త్రివేదీ కఠినమైన న్యాయమూర్తిగా పేరు పొందారు.

మోదీపై విమర్శలు.. పత్రికాధిపతి అరెస్ట్!

- ఆర్థిక మోసాలకు పాల్పడ్డారన్న ఈడీ
- ప్రభుత్వాన్ని, మోదీని విమర్శించినందుకేనన్న కుటుంబ సభ్యులు, విపక్షాలు

బాహుబలి షా

అహ్మదాబాద్ : 'గుజరాత్ సమాచార్' దిన పత్రిక యజమానుల్లో ఒకరైన బాహుబలి షాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం రాత్రి అరెస్ట్ చేసింది. ఆయన ఆర్థిక మోసాలకు పాల్పడినట్లు ఆరోపణలు నమోదు చేసింది. గుజరాత్‌లో అత్యధిక సర్క్యులేషన్ గల దిన పత్రికల్లో 'గుజరాత్ సమాచార్' ఒకటి. దీనిని బాహుబలి, ఆయన సోదరుడు శ్రేయాన్ష్ షా నడుపుతున్నారు. ఈడీ ఆరోపణల గురించి మేనేజింగ్ ఎడిటర్ శ్రేయాన్ష్ మాట్లాడుతూ, పాత కేసులో బాహుబలిని అరెస్ట్ చేశారని, ఆయనపై మోపిన ఆరోపణల గురించి తమకు తెలియదని చెప్పారు. గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ శక్తి సింహ్ గోహిల్ మాట్లాడుతూ... ఐటీ సోదాలు జరిగిన కొన్ని గంటల్లోనే బాహుబలిని ఈడీ అరెస్ట్ చేసిందన్నారు. ప్రధాని మోదీపైనా, ఆయన ప్రభుత్వంపైనా విమర్శనాత్మక కథనాలను రాయడమే బాహుబలి అరెస్ట్‌కు అసలు కారణమని ఆరోపించారు. గోహిల్ చేసిన ఎక్స్ పోస్ట్‌లో.. సత్యం కోసం గట్టిగా నిలబడినవారిని శిక్షించడమే బీజేపీ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. 'గుజరాత్ సమాచార్' ఎల్లప్పుడూ అధికారానికి ఎదురు నిలిచిందని చెప్పారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల విషయంలో మోదీని, బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శించినందువల్ల, మోదీ తన టూల్ కిట్‌ను తెరిచారని ఆరోపించారు. మోదీ ఐటీ, ఈడీలను 'గుజరాత్ సమాచార్' పైనా, దాని టెలివిజన్ చానల్ జీఎస్‌టీవీపైనా ఉసి గొలిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ గుజరాత్ శాఖ అధ్యక్షుడు ఇసుదన్ గఢ్వి కూడా ఐటీ సోదాలు, ఈడీ అరెస్ట్‌ను ఖండించారు. నిర్భయ పాత్రికేయాన్ని బెదిరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

5 వేల మంది పాక్ బిచ్చగాళ్లను తరిమేసిన సౌదీ

ఇస్లామాబాద్, మే 16: ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న పాక్ నుంచి ఆ దేశ పౌరులు కొందరు విదేశాలకు వెళ్లి యాచక వృత్తి చేస్తున్నారు. అయితే వారిని భరించలేక సౌదీ అరేబియా ఒక్కసారిగా 5 వేల మందిని తిరిగి పాక్‌కు పంపించింది. పాక్ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి మొహసిన్ నఖ్వీ శుక్రవారం జాతీయ అసెంబ్లీకి వెల్లడించారు. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ సభ్యుడు ఎంఎన్ఏ సెహర్ కమ్రాన్ అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు.

ఆ రాక్షసబల్లి 23 కోట్ల ఏండ్ల నాటిది

గతంలో తెలంగాణలో అవశేషాలు లభ్యం

హైదరాబాద్, మే 16: తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1980వ దశకంలో ఓ రాక్షసబల్లి అవశేషాలు దొరికాయి. ప్రాణహిత-గోదావరి లోయలో అన్నారం గ్రామానికి దక్షిణ దిశలో కిలోమీటర్ దూరంలో వీటిని గుర్తించారు. వీటిపై నిర్వహించిన పరిశోధనల ఫలితాలు ఇటీవలే వెలుగులోకి వచ్చాయి. దీనిని బట్టి ఈ రాక్షసబల్లి దాదాపు 22.9-23.3 కోట్ల సంవత్సరాల క్రితం జీవించి ఉంటుందని వెల్లడైంది. ఇది మాంసాహారి అని, అమెరికా వెలుపల ఈ జీవిని గుర్తించడం ఇదే మొదటిసారి అని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రాణహిత-గోదావరి లోయలోని మలేరీ ఘాట్ల వద్ద ఈ అవశేషాలు కనిపించాయి. మొదటి సారి దీనిని గుర్తించిన శాస్త్రవేత్త తారావత్ కుట్టి. అందువల్ల దీనికి మలేరీరాప్టర్ కుట్టి అని పేరు పెట్టారు.

యూపీఎస్సీ 2026 షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) 2026లో నిర్వహించే వివిధ పోటీ పరీక్షల క్యాలెండర్‌ను శుక్రవారం విడుదల చేసింది. దాని ప్రకారం సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎస్ఈ) ప్రిలిమినరీ 2026 మే 24న జరుగుతుంది. సీఎస్ఈ మెయిన్స్ పరీక్ష ఆగస్ట్ 21న జరుగుతుంది. నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్) పరీక్షలు వచ్చే ఏడాది ఏప్రిల్ 12న జరుగుతాయి. ఈ పరీక్షల సెకండ్ సెషన్ 2026 సెప్టెంబరు 13న నిర్వహిస్తారు. యూపీఎస్సీ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్) పరీక్ష 2026 జూలై 19న జరుగుతుంది.

సీఎస్ఈ ప్రిలిమ్స్ అడ్మిట్ కార్డుల విడుదల

సీఎస్ఈ ప్రిలిమ్స్, 2025 అడ్మిట్ కార్డులను యూపీఎస్సీ విడుదల చేసింది. అభ్యర్థులు upsc.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్షా కేంద్రాల్లో ప్రవేశానికి అడ్మిట్ కార్డు తప్పనిసరి.

తెగులు తెలుసుకొని మందు చల్లుతుంది

రోబోను ఆవిష్కరించిన ఐఐటీ ఖరగ్‌పూర్

న్యూఢిల్లీ: పంటకు పట్టిన తెగులును స్వయంగా గుర్తించి, తగిన పురుగు మందులను చల్లే మరమనిషి(రోబో)ను ఐఐటీ- ఖరగ్‌పూర్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ శాస్త్రవేత్తల బృందానికి నాయకత్వం వహించిన ప్రొఫెసర్ దిలీప్ కుమార్ ప్రతిహార్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ రోబోను ప్రయోగశాలలో, బయట పరీక్షించారు. రానున్న ఆరు నెలల్లో ఐఐటీ ఖరగ్‌పూర్ క్యాంపస్‌లోని వ్యవసాయ క్షేత్రంలో దీన్ని పరీక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ రోబో బ్యాటరీని ఛార్జ్ చేసిన తర్వాత దాదాపు గంటన్నర సేపు పని చేస్తుంది. 40-50 మీటర్ల మేరకు పురుగు మందును చల్లుతుంది.

జోరుగా 'బాయ్‌కాట్ తుర్కియే'

వాణిజ్య బహిష్కరణకు సీఏఐటీ పిలుపు

న్యూఢిల్లీ, మే 16: భారత్‌తో సైనిక ఘర్షణల సందర్భంగా పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచి డ్రోన్లతోపాటు సైనిక సిబ్బందిని కూడా అందచేసిన తుర్కియే, అజర్‌బైజాన్‌లపై భారత్‌లో బహిష్కరణల పర్వం కొనసాగుతోంది. తాజాగా, తుర్కియే, అజర్‌బైజాన్ దేశాలతో జరుపుతున్న అన్ని రకాల వాణిజ్యాన్ని, వాణిజ్య సంబంధాలను బహిష్కరించాలని ట్రేడర్స్ లాబీ 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్' (సీఏఐటీ) శుక్రవారం పిలుపునిచ్చింది. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు పలుకుతూ ఆల్ ఇండియా జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) కూడా తుర్కియే, అజర్ బైజాన్ దేశాలతో అన్ని రకాల వర్తక, వాణిజ్యాన్ని రద్దు చేసుకోవాలని పరిశ్రమ వర్గాలను కోరింది. ఆ దేశాల వస్తువులను, ఇతర ఉత్పత్తులను ఆపేయాలని, ట్రేడర్స్ అంతా ఆ దేశాల నుండి దిగుమతులను నిలిపివేయాలని 'సీఏఐటీ' నిర్ణయించింది.



జేఎన్‌యూ బాటలో ఐఐటీ-రూర్కీ

టర్కీలోని ఇనోను వర్సిటీతో ఐఐటీ-రూర్కీ తన ఒప్పందాన్ని రద్దు చేసింది. భారత దేశ విద్యా వ్యూహం, జాతీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా ఉంటాయని తెలిపింది. పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ కూడా టర్కీలోని విద్యా సంస్థలతో కుదుర్చుకున్న ఎంఓయూలను రద్దు చేసింది.